సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
దీపావళి శుభాకాంక్షలు
7
సోమవారం । 20 । అక్టోబర్ । 2025



దివ్యకాంతుల దీపావళి

ఆకాశమంతా పటాకుల ప్రకాశం.. నేలంతా దీపాల వెలుగుల వికాసం. చీకటి చెదిరి వెలుగులు పరిచే ఈ పండగ, ప్రతి మనసులో ఆశల జ్యోతులు వెలిగిస్తుంది. మనసులోని దుశ్చింతలను తుడిచి, ఆశల, ఆనందాల కాంతిని నింపే పండగ దివ్యకాంతుల దీపావళి. సోమవారం దీపావళి సందర్భంగా జిల్లాలోని బాణసంచా దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

న్యూస్‌రీల్

దివ్య దీపావళి శుభాకాంక్షలు



కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట): చీకటిపై వెలుగు సాధించిన విజయంగా దీపావళి పర్వదినాన్ని లక్ష్మీదేవి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అజ్ఞాన చీకట్లను పారద్రోలి మన జీవితంలో వెలుగులు నింపే దీపావళిని ఆనందంగా, జాగ్రత్తగా జరుపుకోవాలని కోరారు.

వెలుగుల పండగ కావాలి



పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

అందరి జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని, వెలుగు పండగ దీపావళి అందరిలో సంతోషాలు వెల్లివిరియాలని ఎమ్మెల్సీ సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటూ కుటుంబసభ్యులతో కలిసి సురక్షితంగా పండగ జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

పర్యావరణహితంగా దీపావళి జరుపుకోవాలి

నెల్లూరురూరల్: జిల్లా ప్రజలందరూ పర్యావరణ హితంగా జరుపుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో కోరారు. పెద్దపెద్ద శబ్దాలు, కాలుష్యం వెదజల్లే టపాసులు కాకుండా వెలుగుదివ్వెలు విరజిమ్మే టపాసులు కాల్చాలన్నారు. తల్లిదండ్రులు, పెద్దల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జేసీ శుభాకాంక్షలు

జిల్లా ప్రజలు ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలు, వెలుగుదివ్వెల కాంతులతో పండగను ఆనందంగా జరుపుకోవాలని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అంధకారంపై వెలుగు సాధించిన పండగ దీపావళి స్ఫూర్తితో నిర్వహించాలని కోరారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

నెల్లూరు (క్రైమ్): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) దీపావళి పండగ సందర్భంగా రద్దు చేసినట్లు ఎస్పీ అజిత వేజెండ్ల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పెన్నానది తీర గ్రామాల్లో అలర్ట్

- సోమశిల నుంచి 4–5 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలయ్యే అవకాశం
- ఆర్డీఓ బి పావని

ఆత్మకూరు: రాగల 24 గంటల్లో సోమశిల జలాశయం నుంచి 4 లక్షల నుంచి 5 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేయనున్నట్లు జలాశయం అధికారులు హెచ్చరికలు చేశారని, ఈ అధిక నీటి ప్రవాహానికి వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లడంతోపాటు లోతట్టు గ్రామాలు నీటమునిగే అవకాశం ఉందని ఆత్మకూరు ఆర్డీఓ బి పావని తెలిపారు. ఆదివారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పెన్నా పరీవాహక గ్రామాల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లు, వీఆర్‌ఓలకు సూచనలు చేశామన్నారు. ఎమర్జెన్సీ విధుల్లో భాగంగా లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడం, ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆమె కోరారు. తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. ప్రజలు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న వాగులు, వంకలు చెరువుల వద్దకు వెళ్లొదని, రహదారులపై పొంగి పారుతున్న వాగులను దాటొద్దని ఆమె కోరారు. పోలీసు సిబ్బంది అలాంటి ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలన్నారు. తీవ్ర వర్షాలు కావడంతో గ్రామాల్లో ఉన్న గర్భిణులు, బాలింతలు, వృద్ధులు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు.

కొండలు కరిగించి.. గ్రావెల్ దోచేసి

టీడీపీ నేతలు ధనదాహంతో ప్రకృతిని విధ్వంసం చేస్తున్నారు. గ్రామానికి సహజ సౌందర్యంగా ఉండే కొండలను గ్రావెల్ కోసం అనుమతుల్లేకుండా అక్రమంగా తవ్వేస్తున్నారు. పశువులకు మేతపోరంబోకు భూముల్లో గ్రావెల్ కొల్లగొట్టి రూ.కోట్లు మింగుతున్నారు. టీడీపీ నేతలు దాష్టీకంతో పశువులకు మేతలేకుండా పోతుందని పాడిరైతులు ఆందోళన చెందుతుంటే.. భారీ గోతుల్లో తమ పిల్లలకు ఎక్కడా ప్రాణాపాయం తలెత్తుతుందోనని ఆ గ్రామ ప్రజలు భయంతో వణికిపోతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నా.. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలు కన్నెత్తి చూడకపోవడంపై, ముడుపులు తీసుకుని మౌనంగా ఉంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

యర్రబల్లి తిప్ప కింద ఏర్పడిన గ్రావెల్ గోతులు



అనుమతుల్లేకుండా తవ్వకాలు

- ప్రమాదకర స్థాయిలో భారీ గోతులు
- రూ.కోట్లు మింగుతున్న టీడీపీ నేతలు
- పశువులకు మేత లేకుండా పోతుందని రైతుల ఆందోళన



తిప్పకు అతి దగ్గరలో గోతులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అధికార మదంతో టీడీపీ నేతలు బరితెగిస్తున్నారు. ప్రజల కడుపులే కాదు.. చివరకు పశువుల కడుపులు కొడుతున్నారు. పశువుల మేతపోరంబోకు భూమిగా ఉండే యర్రబల్లి కొండను కొల్లగొడుతున్నారు. పొదలకూరు మండలం యర్రబల్లికే మణిహారంగా, ప్రకృతి సౌందర్యంగా ఉండే సహజ కొండ కింద భూముల్లో గ్రావెల్‌ను తవ్వి జేబులు నింపుకొంటున్నారు. నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేత అండతో ఆకాశమే హద్దుగా అవినీతికి పాల్పడుతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రశ్నించే స్థానికులను పోలీసులతో బెదిరించి అడ్డూ అదుపు లేకుండా గ్రావెల్ దోపిడీకి పాల్పడుతున్నారు. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా రాత్రి, పగలు తేడా లేకుండా కొండ కింద గ్రావెల్‌ను తరలించి గోతులను మిగుల్చుతున్నారు. పశువులు మేత మేసేందుకు సైతం ఇబ్బందులు తలెత్తుతున్నట్లు ఆయా గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. అధికారమే అండగా చెలరేగిపోతున్నా గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇక్కడి గ్రావెల్ తవ్వకాలపై ఇటీవల గ్రామానికి చెందిన అధికార పార్టీకు చెందిన నేతలే అక్రమ గ్రావెల్ తరలించేందుకు వీల్లేదని టిప్పర్లను అడ్డుకున్నారు. వర్షం వల్ల ప్రస్తుతం అక్రమ గ్రావెల్‌ను తరలించడం నిలిపివేసిన అక్రమార్కులు తిరిగి తరలించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

అనుమతులు లేకుండా తరలింపు

యర్రబల్లి తిప్ప కింద నుంచి జేసీబీలు ఏర్పాటు చేసి టిప్పర్లలో రాత్రి వేళ తరలిస్తున్నట్లు గ్రామస్తులు వెల్లడించారు. ఉదయం 6 గంటల వరకు గ్రావెల్ తరలింపు జరుగుతూనే ఉంది. నాలుగు రోజుల క్రితం అధికార పార్టీకి చెందిన నాయకులు గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను నిలిపివేశారు. అక్రమంగా గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకోవడంతో ఏర్పడిన గోతుల్లో వర్షాకాలంలో నీరు చేరి పిల్లలు అటుగా వెళితే ప్రమాదాలు ఏర్పడతాయని నిలదీశారు. అయితే మధ్యాహ్నం వరకు టిప్పర్లను నిలిపిన వారిని పోలీసు కేసులు పెడతామని బెదిరించడంతో వారు మిన్నకుండిపోయినట్లు తెలిసింది. ఎటువంటి అనుమతులు లేకుండా తమ గ్రామం నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించడమే కాక గ్రామస్తులపైనే కేసులు పెట్టిస్తామని బెదిరించడం ఎంతవరకు సబబని గ్రామంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు మైనింగ్ అధికారులు స్పందించి కొండ విధ్వంసాన్ని అడ్డుకోవాలని స్థానికులులు కోరుతున్నారు.

గ్లాసులో గలాటా

- జనసేనలో ఆధిపత్య కుంపటి
- ఏపీ టిడ్కో ఛైర్మన్ అజయ్ వైఖరిపై ఏకతాటిపైకి వచ్చిన నేతలు
- బహిరంగంగా విమర్శలు, ఆరోపణలతో రచ్చకెక్కిన వైనం
- అమరావతిలో పంచాయితీ
- నివురుగప్పిన నిప్పులా పోరు

నెల్లూరు సిటీ/నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న జనసేన పార్టీ నేతలు అధికారం కోసం ఆధిపత్యం పోరుతో రచ్చకెక్కారు. నాయకుల మధ్య విభేదాలు తారా స్థాయికి వెళ్లాయి. దశాబ్దానికి పైగా పార్టీ జెండాలు మోసి.. సొంత డబ్బులు ఖర్చు పెట్టుకున్నా.. పదవులు దక్కకపోగా అవమానాలు ఎక్కువయ్యాయంటూ ఆ పార్టీ నేతలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. కూటమితో పొత్తు పెట్టుకున్నా.. కనీసం జిల్లాలో ఒక్క సీటు కూడా జనసేనకు ఇవ్వలేదని, కూటమి అధికారంలోకి వచ్చినా తమకు ప్రాధాన్యత లేకుండా పోయిందంటూ, కొన్ని దుష్టశక్తులు పాలిస్తున్నాయంటూ ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌పై ధ్వజమెత్తుతూ ఇటీవల నియోజకవర్గ స్థాయి ఇన్‌చార్జ్‌లు నగరంలో ఓ కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. జనసేన అంటే తామే అని కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని, ఆ దుష్టశక్తుల నోర్లు మూయించేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశామంటూ అజయ్‌పై బహిరంగ విమర్శలు చేశారు. ఈ రచ్చ ఆ పార్టీలో కలకలం రేపింది.

నేను చెబితేనే పనులు చేయండి

ఉమ్మడి జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులకు అజయ్‌కుమార్ తాను చెప్పిన వారికి మాత్రమే పనులు చేయాలని సూచించారని జనసేన నేతలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. జనసేన నుంచి ఎవరు వచ్చినా పనులు చేయొద్దని చెప్పారంట. ఇటీవల జనసేన నేత ఓ ఎమ్మెల్యే వద్దకు వెళ్లి పని అడగ్గా అజయ్ ద్వారా చెప్పించాలని చెప్పడం గమనార్హం. దీంతో కంగుతిన్న ఆ నేత భంగపడినట్లు సమాచారం. జిల్లాలో ఆలయ, ఏఎంసీ కమిటీ పదవులు కూడా తాను చెప్పిన వారికే ఇవ్వాలని ఆదేశించారంట. ఇతర పార్టీ ల నుంచి ఇటీవల జనసేనలో చేరిన వారికే ప్రాధాన్యత ఇస్తుండడంతో ఈ విషయాన్ని నాగబాబు, మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి జిల్లా నాయకులు తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో అజయ్‌ను టార్గెట్ చేస్తూ ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు బహిరంగంగా విమర్శలకు దిగారు.

అజయ్ వర్గం దాడులపై ఆగ్రహం

ఇటీవల సంగం మండలం తరుణవాయికి చెందిన జనసేన కార్యకర్త ఎం.ఆనందరావు ఇంటిపై అజయ్ వర్గానికి చెందిన వ్యక్తులు దాడి చేశారు. గూడూరు నియోజకవర్గానికి చెందిన జనసేన కార్యకర్త సాయిపై అజయ్ వర్గానికి చెందిన వ్యక్తి కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలతో జనసేన నేతల్లో ఆగ్రహజ్వాలలు తీవ్రమయ్యాయి. కర్మ సిద్ధాంతం ఎవరినీ వదలదు. ఏళ్లుగా కష్టపడిన తమను పార్టీలో లేరని చెప్పడం బాధాకరంటూ అజయ్‌ను ఉద్దేశించి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాగబాబుకు అత్యంత ఆప్తుడు కావడంతోనే అజయ్‌కు టిడ్కో ఛైర్మన్ పదవి దక్కింది. ప్రస్తుతం పార్టీలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది.

విచారణ కమిటీ ఏర్పాటు

ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తీరుపై జిల్లా జనసేన నేతల బహిరంగ విమర్శల నేపథ్యంలో ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో శనివారం అమరావతిలో పార్టీ నేతలతో పంచాయితీ పెట్టారు. ఈ సమావేశానికి అజయ్‌ను ఆయన సన్నిహితులను పక్కన పెట్టినట్లు సమాచారం. నెల్లూరులో జరుగుతున్న పరిణామాలను వివరించారు. అజయ్‌కుమార్ ఒంటెద్దుపోకడలపై జిల్లా నేతలు ఫిర్యాదు చేశారు. శ్రామికనగర్‌లో రూ.కోట్లు విలువ చేసే భూ కుంభకోణంలో అజయ్‌కుమార్ పాత్రను వివరించినట్లు సమాచారం. ఈ సందర్భంగా జనసేన నేత, ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌రెడ్డి నేతృత్వంలో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. త్వరలో నెల్లూరుకు వచ్చి ఆయన జనసేన వర్గాల్లో తలెత్తిన విభేదాల పై జనసేన పార్టీ అధిష్టానానికి వివరణ ఇవ్వనున్నారు.

రోడ్డుపై విరిగిపడిన కొండచరియలు



అర్ధరాత్రి కొండచరియలను పక్కకు తొలగిస్తున్న పోలీసులు, స్థానికులు

సంగం: సంగంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొండ వద్ద ఉన్న నెల్లూరు– ముంబై జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడ్డాయి. సమాచారం అందుకున్న ఎస్సై రాజేష్ అర్ధరాత్రి వెంటనే స్పందించిన తన సిబ్బందితో కలిసి రహదారిపై పడిన కొండ చరియలను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎస్సై రాజేష్ మాట్లాడుతూ వాహనదారులు కొండ వద్ద జాతీయ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కొండపై ఉన్న రాళ్లు విరిగిపడే ప్రమాదం ఉన్నందున రాత్రి సమయాల్లో వాహనదారులు మరెంతో జాగ్రత్తలు పాటించాలని, కొండ వద్ద వాహన వేగం తగ్గించి వెళ్లాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్న సమయంలో వాహనదారులు వెంటనే 112 నంబర్‌కు కానీ తమకు కానీ ఫోన్ చేస్తే స్పందించి అక్కడికి చేరుకుని సహాయం చేస్తామని తెలియజేశారు.



పత్రికా స్వేచ్ఛను హరించడమే



'సాక్షి'పై కక్ష కట్టి పోలీసు కేసులను నమోదు చేసి పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు. 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి, నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జి మస్తాన్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టడం జర్నలిస్టుల గొంతు నొక్కడమే. నచ్చని వార్తలు పత్రికల్లో ప్రచురితమైతే న్యాయపరంగా ఎదుర్కోవాలే కాని ఇలా కేసులు నమోదు చేసి వేధించడం ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదు.

– పెదమల్లు రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సీనియర్ నాయకుడు, పొదలకూరు


ప్రజాస్వామ్యానికి విఘాతం



పత్రికలపై దాడులకు పాల్పడడం, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించడమే అవుతుంది. 'సాక్షి' పత్రిక ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక పాలనను బహిర్గతం చేస్తుందన్న అక్కసుతోనే ఎడిటర్ ధనంజయరెడ్డిపై వరుస కేసులు నమోదు చేయిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు చూడలేదు.

– గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు, వైఎస్సార్‌సీపీ, మహ్మదాపురం, పొదలకూరు మండలం

అక్రమ కేసులతో అణచివేయలేరు



ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా వ్యవహరించే పత్రికా రంగం ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాల్లో ఒకటి. అలాంటి పత్రికా రంగాన్ని అణచివేసే ధోరణిలో వార్తలు రాసే విలేకరులు, ఎడిటర్లపై పోలీసులు బెదిరింపు ధోరణిలో వ్యవహరించడం సరికాదు. రాష్ట్రంలో 'సాక్షి' పత్రికపై ప్రభుత్వం అక్రమ కేసులతో కక్ష సాధింపు ధోరణిలో వ్యవహరిస్తోంది.

– డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు

కక్ష సాధింపు చర్యలు తగవు



జర్నలిస్టులు రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా సమస్యలను వెలుగులోకి తెస్తారు. 'సాక్షి' పత్రికలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాశారనే కోణంతో ఆ పత్రికను ప్రభుత్వం టార్గెట్ చేసింది. అందులో పనిచేసే జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం మంచి పద్ధతి కాదు. ఈ విధానాన్ని ప్రభుత్వం మార్చుకోవాలి.

– వి.నరసింహులు, జేపీసీ

తప్పులు సరిదిద్దుకోలేకనే వేధింపులు



అధికార పార్టీ నేతలు చేస్తున్న తప్పులను సరిదిద్దుకోలేని ప్రభుత్వం 'సాక్షి' జర్నలిస్టులపై దాడులు చేస్తోంది. అర్ధరాత్రి పూట మహిళలని చూడకుండా 'సాక్షి' బ్యూరో ఇంటికి పోలీసులను పంపి నోటీసులు ఇవ్వడం దారుణం. సమస్యలను పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం ఇలాంటి సంస్కృతికి తెరతీయడం దుర్మార్గం. నోటీసులు, విచారణ, కేసుల పేరుతో వేధిస్తే ప్రజలే ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతారు.

– సాగర్‌రెడ్డి, జేపీసీ

జిల్లాకు భారీ వర్ష సూచన

- రెండు రోజుల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం
- ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి
- మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దు
- కలెక్టర్ హిమాన్షు శుక్లా



కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరురూరల్: ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని, మంగళవారం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావంగా జిల్లాకు భారీ వర్ష సూచన ఉందని జిల్లాలోని ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం తెలిపారు. ఈ అల్పపీడనం 48 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ మధ్య బంగాళాఖాతం, పశ్చి మ మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందన్నారు. బుధవారం నుంచి జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు భారీ వర్షాల ప్రభావం అధికంగా ఉంటుందని, ఈ ప్రభావంతో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొదు

అక్టోబర్ 21వ తేదీ మధ్యాహ్నం నుంచి దక్షిణ మధ్య బంగాళాఖాతంలోకి సముద్రయాత్రలు చేయొద్దని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదని, సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారులు తప్పనిసరిగా అక్టోబర్ 21వ తేదీ లోపు తీరానికి చేరుకోవాలన్నారు.

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి


ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసేప్పుడు ప్రజలు చెట్ల కింద నిలబడరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీర ప్రాంతాల్లో గాలి వేగం గంటకు 4,565 కి.మీ. వరకు ఉండొచ్చన్నారు. తీర ప్రాంత గ్రామాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని కలెక్టర్ చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, జిల్లా అధికారుల సూచనలను పాటించాలని కలెక్టర్ సూచించారు.

49.1 మి.మీ. సగటు వర్షపాతం

నెల్లూరు(అర్బన్): ఈశాన్య రుతుపవనాల ప్రారంభంలోనే జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయానికి జిల్లాలో సగటున 49.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సంగంలో 140.6 మి.మీ., అత్యల్పంగా సైదాపురంలో 1.4 మి.మీ. వర్షం కురిసింది. కోవూరులో 96.2, నెల్లూరు అర్బన్ 93.4, బోగోలు 93.2, నెల్లూరు రూరల్ 90.4, ఆత్మకూరు 82.2, కలువాయి 80.4, బుచ్చిరెడ్డిపాళెం 80.2, చేజర్ల 68.2, ఏఎస్‌పేట 65.2, ఇందుకూరుపేట 64.8, గుడ్లూరు 62.4, తోటపల్లిగూడూరు 61.8, మర్రిపాడు 58.4, కావలి 55.6, కలిగిరి 47.0, అల్లూరు 45.8, కొండాపురం 45.6, పొదలకూరు 45.4, జలదంకి 43.6, దగదర్తి 43.2, కొడవలూరు 42.4, లింగసముద్రం 42.2, ఉలవపాడు 41.4, వింజమూరు 40.6, దుత్తలూరు 37.4, ముత్తుకూరు 36.4, అనంతసాగరం 33.8, విడవలూరు 32.6, వెంకటాచలం 21.2, ఉదయగిరి 20.4, వలేటివారిపాళెం 16.8, సీతారామపురం 11.8, కందుకూరు 11.2, రాపూరు 5.8, మనుబోలు 3.6, వరికుంటపాడులో 3.4 మి.మీ. వర్షం కురిసింది.

32,750 క్యూసెక్కుల నీరు విడుదల

సోమశిల: సోమశిల జలాశయం నుంచి 8, 9 క్రస్ట్ గేట్ల ద్వారా పెన్నానదికి 32,750 క్యూసెక్కుల వరద జలాలను విడుదల చేసినట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 73.394 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. ఉత్తరకాలువకు 50, కండలేరు కాలువకు 2200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

క్లుప్తంగా

అమరులకు వందనం

- రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం


అమరవీరుల స్థూపం

నెల్లూరు(క్రైమ్): దేశభద్రతకు సరిహద్దుల్లో సైన్యం .. సమాజంలో అంతర్గత భద్రత.. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అనుక్షణం పోరాటం చేస్తున్నారు. వారులేని సమాజాన్ని ఊహించుకోలేం. సంపన్నులు మొదలు సామాన్యుడి వరకు అందరూ సాయం కోసం చూసేది పోలీస్ వైపే. ప్రజల మాన, ప్రాణాలను కాపాడే క్రమంలో చివరకు ప్రాణత్యాగానికి సైతం వెనుకాడరు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమరుల త్యాగాలు చిరస్మరణీయం. 1959 అక్టోబర్ 21వ తేదీన దేశభద్రత కోసం భారత్, చైనా సరిహద్దుల్లో ఉన్న లడఖ్ అక్సాయ్ చిన్ వద్ద విధులు నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లపై చైనా సైనికులు భారీ సంఖ్యలో విరుచుకుపడ్డారు. భారత జవాన్లు ఆత్మస్థైర్యంతో వీరోచితంగా పోరాడి చొరబాటుదారుల దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టారు. ఈ భీకరపోరులో అసువులు బాసిన అమరుల త్యాగాలకు గుర్తుగా ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా మావోయిస్టులు, ఉగ్రవాదులు, ఇతర అసాంఘిక శక్తులతోపాటు అల్లర్లు, అలజడులను అణిచివేసే క్రమంలో అమరులైన పోలీసు సిబ్బందిని స్మరిస్తూ సోమవారం నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలపై ప్రజలను చైతన్యపరిచేలా వారోత్సవాలు నిర్వహించనున్నారు.

ఈ ఏడాది పదిమంది

ఈ ఏడాది జిల్లాలో అనారోగ్యం, రోడ్డు ప్రమాదం తదితర కారణాలతో పదిమంది మృతిచెందారు. ఏఎస్సై కె.లక్ష్మీనరసయ్య, హెడ్‌కానిస్టేబుల్స్ ఎం.నాగయ్య, ఎం.చలపతిరావు, డి.రాజశేఖర్, ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్లు యు.శివకుమార్, ఎస్.నాగరమేష్, ఎస్.అంకయ్య, జి.శివకుమార్, కె.రమేష్‌బాబు, వై.రమేష్‌లు చనిపోయారు.

దీపావళి కాంతులు



- అప్రమత్తతతోనే ఆనందం
- సంబరాల్లో జాగ్రత్తలు తప్పనిసరి


వీఆర్సీ మైదానంలో బాణసంచా దుకాణాల వద్ద జనం


టపాసులు కొంటూ..


మట్టి ప్రమిదల విక్రయాలు


దుకాణంలో కొనుగోలుదారులు

నెల్లూరు(క్రైమ్): దీపావళి.. ఈ పండగంటే ప్రతి ఒక్కరికీ ఆనందం. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా, కులమతాలకు అతీతంగా అందరూ ఆనందోత్సాహాలతో పండగ చేసుకుంటారు. దీపావళి అంటే ముందుగా గుర్తుకొచ్చేది టపాసులే. పల్లె నుంచి పట్నం వరకూ మతాబుల మోతతో దద్దరిల్లాల్సిందే. ఇంటిల్లిపాది మతాబులు కాలుస్తూ సంతోషంగా గడుపుతారు. రంగురంగుల వెలుగుల్లో దీపావళి కాంతుల్లో ఏమాత్రం అజాగ్రత్తగా ఉంటే చాలా ప్రమాదమే. వెలుగుల ఆనందం కాస్తా అంధకారంగా మారుతుంది. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే పండగను సంతోషంగా జరుపుకోవచ్చు.

ఇవి పాటించాలి

లైసెన్స్ షాపుల్లోనే బాణసంచా కొనుగోలు చేయాలి. వాటిని వంటగది, పొయ్యి ఉన్న ప్రాంతాల్లో ఉంచరాదు. సురక్షిత ప్రదేశంలో పెట్టాలి. ఇంటి బయట, మైదానాల్లో మాత్రమే కాల్చాలి. ఈ సమయంలో దగ్గరగా నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలి. తల్లిదండ్రుల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చాలి. కాటన్ దుస్తులు, పొడుగు చేతుల వస్త్రాలను మాత్రమే ధరించాలి. కాళ్లకు బూట్లు, కళ్ల జోడు ధరించడం మంచిది. తారాజువ్వలను బాటిళ్లలో పెట్టి నిటారుగా ఉండేలా సరిచూసుకోవాలి. ఈ విషయంలో ఏ మాత్రం అజాగ్రత్త వహించినా అవి ఇళ్లలోకి దూసుకుపోయే ప్రమాదముంది. గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాలు, గడ్డి వాములు, పూరిగుడిసెలు ఉండే ప్రదేశాల్లో చిచ్చుబుడ్లు, రాకెట్లు, తారాజువ్వలు వంటివి కాల్చరాదు. సగం కాలిన వాటిని చేతులతో పట్టుకోవడం తగదు. బాణసంచా పూర్తిగా కాలలేదనుకుంటే పొరపాటే. అకస్మాత్తుగా పేలి గాయాలకు గురయ్యే పరిస్థితి. బాణసంచా కాల్చే సమయంలో వెలువడే వాయువును పీల్చడం హానికరం. గంధం, జింకు, మెగ్నీషియం, నైట్రేట్ వంటి పదార్థాలతో తయారైన టపాకాయలతో వచ్చే వాయువు పీల్చడంతో ఊపిరితిత్తులు దెబ్బతినడం, శ్వాసకోశ, ఆస్తమా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు, గర్భిణులు, రెండేళ్ల లోపు చిన్నారులకు దూరంగా టపాకాయలను కాల్చడం మంచిది. ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో బాణసంచా వల్ల గాయపడితే సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించాలి. అనుకోని ప్రమాదం జరిగినప్పుడు 101కు సమాచారం అందించాలి.

కాపులంతా కళ్లు తెరవాలి

- కూటమి ప్రభుత్వంలో న్యాయం జరిగే పరిస్థితి లేదు
- లక్ష్మీనాయుడి హత్యను పక్కదారి పట్టించే కుట్ర
- రాధా, రంగా మిత్రమండలి రాష్ట్రాధ్యక్షుడు వంగవీటి నరేంద్ర


మాట్లాడుతున్న వంగవీటి నరేంద్ర

కందుకూరు: 'కాపు యువకుడు లక్ష్మీనాయుడు హత్యను పక్కదారి పట్టించేందుకు ఎల్లో మీడియా కట్టు కథలు అల్లుతోంది. కూటమి ప్రభుత్వంలో కాపులకు న్యాయం జరిగే పరిస్థితి లేదు. ఇప్పటికైనా కళ్లు తెరవాలి' అని రాధా, రంగా మిత్ర మండలి రాష్ట్రాధ్యక్షుడు వంగవీటి నరేంద్ర అన్నారు. గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామంలో హత్యకు గురైన లక్ష్మీనాయుడి కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మీనాయుడు, హంతకుడు కాకర్ల హరిచ్చంద్రప్రసాద్‌లు ప్రాణ స్నేహితులనే విధంగా చిత్రీకరిస్తున్నారన్నారు. ప్రాణ స్నేహితులైతే ప్రాణాలు తీస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మీనాయుడి భార్యను లైంగికంగా వేధించి లొంగకపోయే సరికి అతడిని అడ్డు తొలగించేందుకు హత్య చేశారని వివరించారు.

ఎన్నికల్లో వాడుకుని అన్యాయం

కాపు కులాన్ని ఎన్నికల్లో వాడుకుని ఇంత అన్యాయం జరిగిన తర్వాత కూడా ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మీనాయుడు హత్య కేసులో కేవలం ఇద్దరిని మాత్రమే అరెస్ట్ చేశారన్నారు. మరో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారని, సహకరించిన వారిని కూడా అరెస్ట్ చేయాలన్నారు. ఈ ఘటనలో కులం ప్రస్తావన వచ్చినప్పుడు, ఇప్పుడు తమ కులం గురించి మాట్లాడితే తప్పేంటని ప్రశ్నించారు. మీరు ఒక్కరే మీ కులం ఓట్లతో గెలిచారా? అని ప్రశ్నించారు. అధికారంలోకి రావడానికి కాపులను వాడుకోలేదా అని నిలదీశారు. హరిచంద్రప్రసాద్ స్వతహాగానే నేర ప్రవృత్తిని కలిగి ఉన్నాడని, తన తల్లి చనిపోకముందే చనిపోయినట్లు బీమా క్లెయిమ్ చేశాడన్నారు. హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న మహిళలను కేసులో చేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. లక్ష్మీనాయుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాడతామన్నారు. వారికి కాపులంతా అండగా ఉంటారన్నారు.

ఇష్టారాజ్యంగా..

- పెన్నానదిలో ఇసుక తవ్వకాలు


బండారుపల్లి వద్ద ఇసుకను లోడింగ్ చేస్తూ..

ఆత్మకూరు రూరల్: మండలంలోని బండారుపల్లి వద్ద పెన్నానదిలో ఆదివారం అక్రమంగా ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. మహిమలూరు, దేపూరు గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో నదిలో తాగునీటి బావుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు జరిగే ప్రదేశానికి వెళ్లేలా తాత్కాలికంగా రోడ్డు నిర్మాణం చేశారు. అయితే దేపూరుకు చెందిన కొందరు ఈ రోడ్డుపై జేసీబీలను నిలిపి నదిలో అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్నారు. ఈ సమాచారం అందడంతో సంబంధిత అధికారులు అడ్డుకున్నారు. అయినా అక్రమార్కులు లెక్క చేయకపోవడంతో పలువురు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆత్మకూరు ఎస్సై జిలానీ వెళ్లడంతో అక్రమార్కులు వెళ్లిపోయారు.

ఆగిన విద్యుత్ సరఫరా.. ఆస్పత్రిలో ఇక్కట్లు



- పనిచేయని జనరేటర్లు


సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులో సెలైన్ పెడుతున్న నర్సు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో శనివారం రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ సమయంలో జిల్లా ఆస్పత్రిలో చీకట్లు అలుముకున్నాయి. జనరేటర్ కూడా పనిచేయలేదు. దీంతో పలు వార్డుల్లో రోగులు ఇబ్బంది పడ్డారు. సుమారు గంటన్నరపాటు సరఫరా లేదు. నర్సులు సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులోనే రోగులకు సెలైన్ పెట్టారు. జనరేటర్ కోసం సెక్యూరిటీ వారిని రోగుల బంధువులు సంప్రదించగా డీజిల్ లేక ఎయిర్ లాగడంతో పని చేయడం లేదని చెప్పారు. జిల్లా ఆస్పత్రిలో ఇలాంటి దుస్థితి నెలకొనడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కారుమబ్బులు కమ్మిన వేళ..





నెల్లూరు నగరంలో ఆకాశం కారుమబ్బులతో నిండిపోయింది. జల్లులు కురుస్తున్న వేళలో ఈ ప్రకృతి వర్ణాలు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాయి. పెన్నా నదిపై మబ్బులు కమ్ముకున్న దృశ్యాలు కనువిందు చేశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.35
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.130
లేయర్	రూ.118
బ్రాయిలర్ చికెన్:	రూ.236
స్కిన్‌లెస్ చికెన్:	రూ.260
లేయర్ చికెన్:	రూ.200

సాక్షి క్లాసిఫైడ్స్

నేను ఆత్మహత్య చేసుకుంటున్నా

- వాట్సాప్ గ్రూపులో పెట్టిన వీఓఏ
- వెంటనే స్పందించిన పోలీసులు

దుత్తలూరు: 'నేను ఆత్మహత్య చేసుకుంటున్నా' అంటూ వెలుగు వీఓఏ వాట్సాప్ గ్రూపులో సెల్ఫీ వీడియో పెట్టింది. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఆమెతో మాట్లాడారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నందిపాడులో వెలుగు వీఓఏగా రజియా పనిచేస్తోంది. ఆమె ఆదివారం ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ వాట్సాప్ గ్రూపుల్లో సెల్ఫీ వీడియో పెట్టింది. సీసీ తనను విధుల నుంచి తప్పించి మరొకరిని పెట్టుకోవాలని చూస్తున్నారని అందులో ఆరోపించింది. కొందరు పొదుపు మహిళలు, మరో వ్యక్తి వేధిస్తున్నారని చెప్పుకొచ్చింది. విషయం తెలుసుకున్న ఎస్సై ఆదిలక్ష్మి సకాలంలో స్పందించి రజియాతో మాట్లాడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ వెలుగు అధికారులు వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో విచారించి తగిన చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామన్నారు.

నేడు కోనలో రథోత్సవం

రాపూరు: దీపావళి వేడుకలకు పెంచలకోన ముస్తాబవుతోంది. సోమవారం మూలమూర్తికి పూజలు నిర్వహిస్తామని ఆలయ అధికారులు ఆదివారం తెలిపారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మి ఉత్సవ విగ్రహాలను శ్రీకృష్ణుడు, రుక్మిణీదేవి, సత్యభామగా అలంకరించి రథంపై కొలువుదీర్చి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహిస్తారు. నరకాసురవధ తదితర కార్యక్రమాలు జరుగుతాయి.

బాణసంచా దుకాణాల సీజ్

సోమశిల: మండల పరిధిలోని సోమశిల గ్రామంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలపై ఆదివారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. సుమారు రూ.20 వేల విలువైన బాణసంచాను సీజ్ చేశారు.